అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ ఔదార్యం

- ప్రతి రోజూ 800 మందికి ఆహారం పంపిణీ
- ప్రభుత్వాస్పత్రితో పాటు మరో రెండు ప్రాంతాల్లో పంపిణీ
- భోజనం, చపాతీలు అందజేస్తున్న వైనం
- మూడున్నరేళ్లుగా నిర్వహణ


ప్రభుత్వాస్పత్రిలో రోగులకు భోజనాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించాలనే సంకల్పంతో మూడున్నర ఏళ్ల కిందట అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ ఏర్పాటైంది. నాటి నుంచి నేటి వరకూ పలు ప్రాంతాల్లో నిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వందలాది మంది ఆకలి తీరుస్తున్నారు. విజయవాడలోని పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంతో పాటు వన్‌టౌన్‌లోని బ్రాహ్మణ వీధి, ఏలూరురోడ్డులోని కొత్త వంతెన సెంటర్ ఆంజనేయస్వామి గుడి వద్ద ఈ ఆహార పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. దీంతో వందలాది మంది ఆకలి తీరుస్తున్నారు.

నిత్యం 800ల మందికి పంపిణీ..

ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులతో పాటు వారి వెంట వచ్చే అటెండెంట్స్‌కు మధ్యాహ్నం 12 గంటల సమయంలో చపాతీలు పంపిణీ చేస్తున్నారు. ఒక్కొక్కరికీ మూడు చపాతీలు, కూర పంపిణీ చేస్తున్నారు. ఇలా ప్రతి రోజూ 400ల మందికి పంపిణీ జరుగుతుంది. కొన్ని రోజుల్లో భోజనం కూడా పెడుతుంటారు. అక్కడ ఆహారం తీసుకున్న వారు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా మినరల్ వాటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆకలితో అలమటించకుండా ఇక్కడ ఆహారం తీసుకుని వెళ్తున్నారు.

మరో రెండు ప్రాంతాల్లో..

ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని దూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు వస్తుంటారు. అలాంటి వారి ఆకలిని తీర్చేందుకు వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో సైతం పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ ప్రతి రోజూ 300ల మందికి చపాతీలు పంపిణీ చేస్తున్నారు. ఏలూరు రోడ్డులోని కొత్త వంతెన సెంటర్‌లో ఆంజనేయస్వామి గుడి వద్ద నిత్యం వంద మందికి భోజనం అందిస్తుంటారు. ఆ గుడికి వచ్చిన వారితో పాటు పరిసర ప్రాంతాల్లో షాపుల్లో పనిచేసే వారు భోజనం చేస్తుంటారు. ఇలా నిత్యం 800ల మంది ఆకలి తీర్చేందుకు అన్న సంతర్పణ సమితి కృషి చేస్తోంది.

సభ్యుల సహకారంతోనే..

అన్న సంతర్పణ సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలన్నీ ఈ సమితి సభ్యులతో పాటు దాతల సహకారంతోనే నిర్వహిస్తున్నారు. ఒక మంచి సంకల్పంతో నిర్వహిస్తున్న కార్యక్రమం మూడున్నరేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతుందని సమితి సభ్యులు చెబుతున్నారు. రానున్న కాలంలో మరింత విస్తరిస్తామంటున్నారు. అంతేకాకుండా వేసవిలో ప్రభుత్వాస్పత్రికి చెప్పులు లేకుండా వచ్చే వారికి చెప్పులు, వీల్‌చైర్‌లు పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


చపాతీలు అందజేస్తున్న దృశ్యం

నిరంతరం కొనసాగిస్తాం..



ప్రభుత్వాస్పత్రి ప్రసూతి విభాగానికి దూర ప్రాంతాల నుంచి గర్భిణులు, చిన్న పిల్లలు వస్తుంటారు. వారు బయటకు వెళ్లి భోజనం చేయాలంటే ఇబ్బందిగా ఉంటుందని భావించి ఇక్కడ ఆహారం పంపిణీ చేయడాన్ని ప్రారంభించాం. ప్రతి రోజూ 400ల మందికి చపాతీలు పంపిణీ చేస్తున్నాం. నగరంలో మరో రెండు ప్రాంతాల్లో కూడా ఆహార పంపిణీ కొనసాగుతోంది. ట్రస్టు సభ్యులు, దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగిస్తాం.

– గుండు దిలీప్, అధ్యక్షుడు, అన్న సంతర్పణ సమితి ట్రస్ట్

క్లుప్తంగా

లెర్న్ అండ్ లిప్ పుస్తకావిష్కరణ



గుణదల(విజయవాడతూర్పు): జీవితంలో విజయం సాధించిన వాళ్లు తమ అనుభవాలు పుస్తకం ద్వారా వెల్లడిస్తే అవి ఇతరులకు ఉపకరిస్తాయని ప్రముఖ పారిశ్రామిక వేత్త పర్వతనేని రవి అన్నారు. గుణదలలోని హోటల్ హయత్ ప్లేస్‌లో ఆదివారం టీఎల్‌సీ ఆధ్వర్యంలో పర్వతనేని రవి, పర్వతనేని పద్మ వ్యాపార పారిశ్రామిక రంగంలో మెలకువలపై రచించిన లెర్న్ అండ్ లిప్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జీవిత అనుభవాలు అందరితో పంచుకోవడానికి పుస్తక రచన ఉపయోగపడుతుందన్నారు. తన వ్యాపార జీవితంలో ఎదురైన సమస్యలు, పరిష్కారాలు పుస్తక రూపంలో పొందుపర్చామన్నారు. ఈ పుస్తకం ఒక గైడ్‌లా అందరికీ ఉపయోగపడుతుందని చెప్పారు.

ఆయుర్వేద వైద్యంపై నేడు అవగాహన సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ధన్వంతరీ జయంతిని సందర్భంగా సోమవారం ఉదయం 11.30 గంటలకు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ కార్యాలయం ఆవరణలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేద వైద్యులు ఎస్.సాహితి, కె.పూర్ణరాజేశ్వరి, సత్యప్రశాంత్, ఎన్.ధరణి కుమార్ పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ సదస్సుకు హాజరు కావాలని సూచించారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన వాగ్దేవి మ్యూజిక్ అకాడమీకి చెందిన బృందం ఆలపించిన శాస్త్రీయ సంగీతం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాదెళ్ల సీతారత్నం బృందం పలు కీర్తనలను ఆలపించింది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న సంగీత విభావరిని ఆద్యంతం ఎంతో ఆసక్తిగా ఆస్వాదించారు. అనంతరం బృందంలోని కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎండోక్రైనాలజీ చికిత్సల్లో విప్లవాత్మక ఆవిష్కరణలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): మధుమేహం, ఎండో క్రైనాలజీ చికిత్సల్లో ప్రపంచ వ్యాప్తంగా విప్లవాత్మక ఆవిష్కరణ జరుగుతున్నాయని పలువురు నిపుణులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్, యలమంచి డయాబెటీస్ రీసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ఓ హోటల్‌లో డయాబ్ ఎండోకాన్ 2024 సదస్సు జరిగింది. ఈ సదస్సులో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 500ల మంది వైద్యులు, 25 మంది నిపుణులు పాల్గొని విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ కృష్ణ శేషాద్రికి గోల్డ్‌మెడల్ బహుకరించారు. కార్యక్రమంలో యలమంచి డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యలమంచి సదాశివరావు, డాక్టర్ హిమన, సెక్రటరీ డాక్టర్ ఐశ్వర్య, జాయింట్ సెక్రటరీ డాక్టర్ అమూల్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దీపాల తయారీ పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో దీపావళి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు దియా మేకింగ్(దీపాల తయారీ) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమలోని సృజనాత్మకతతో సరికొత్త దీపాలను తయారు చేశారు. వాటిని అందంగా అలంకరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి కే రమాదేవి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు కళలలోనూ రాణించాలన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కూటమిది.. కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వలేని కూటమి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఆసుల రంగనాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల మున్సిపల్ కార్మికులకు సకాలంలో సమాన వేతనాలు ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించిందని, దీన్ని పలుమార్లు వీఎంసీ పట్టించుకుండా ఉండటంపై కోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసినప్పటికీ మున్సిపల్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుండా జాప్యం చేస్తున్న వీఎంసీ–రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్మికులకు వ్యతిరేకంగా పనిచేయటానికి వీఎంసీ ప్రజల నుంచి వసులు చేసిన పన్నులను రూ.లక్షలు ఖర్చుపెడుతుందని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి కార్మికులకు వ్యతిరేకంగా కేవీయట్ పిటిషన్ వేయటం దారుణమన్నారు. ఇకనైనా వీఎంసీ అధికారులు కార్మిక సంక్షేమాన్ని చూడాలని లేని పక్షంలో తాము ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

దివ్యాంగునికి చేయూత

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం దివ్యాంగునికి రూ.10 వేలు విలువ చేసే సెల్‌ఫోన్ రిపేర్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, నాగమల్లిక మాట్లాడుతూ.. దివ్యాంగుడైన బాలు సెల్‌ఫోన్ మెకానిక్‌గా పనిచేస్తున్నారన్నారు. బాలు ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవటంతో పాటు అవసరమైన సెల్‌ఫోన్ రిపేర్ మెటీరియల్ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. దీంతో ట్రస్ట్ సభ్యుల సహకారంతో సాయం అందజేశామని తెలిపారు.

దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలి


మాట్లాడుతున్న క్రైమ్ ఏడీసీపీ రాజారావు తదితరులు

గుణదల (విజయవాడతూర్పు): దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని క్రైమ్ ఏడీసీపీ ఎం. రాజారావు అన్నారు. నేరాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వర రెడ్డి పర్యవేక్షణలో మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీ పార్క్ పరిసర ప్రాంత ప్రజలు, వాకర్స్‌తో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన..

ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఊర్లకు వెళ్లే సమయంలో ప్రజలు లోకల్ పోలీసులకు తప్పనిసరిగా సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ ప్రవేశపెట్టిన ఈ పహారా, సైబర్ క్రైమ్ నేరాలు, డయల్ 100, 112 ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలని దీని వలన ఎవరైనా దొంగ ఇంటిలోనికి వస్తే వెంటనే అలారం మోగడంతో పాటు సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందుతుందని తెలిపారు. అదే విధంగా సైబర్ క్రైమ్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి, సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరం జరిగినట్లయితే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే సైబర్ సిటిజన్ యాప్ ద్వారా ఏ విధంగా సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, కాలనీ అధ్యక్షులు సుబ్బారావు, సెక్రటరీ నరసింహారావు, స్థానికులు పాల్గొన్నారు.

అలరించిన హిందీ చిత్రగీతాలు



విజయవాడకల్చరల్: విఖ్యాత మ్యూజిక్ సంస్థ మయూరి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో హిందీ చిత్ర సంగీత దర్శకుడు ఆర్ బర్మన్ సంగీత సేవలు గుర్తు చేసుకుంటూ నిర్వహించిన హిందీ చిత్ర గీతాల కార్యక్రమం ఆద్యంతం మధురంగా సాగింది. మహ్మద్ ఖాజా ఆధ్వర్యంలో గాయనీ గాయకులు రసూల్‌బాబు, శ్రీధర్, షహనాజ్, సత్య, సుధా శ్రీనివాస్, కీర్తన, ప్రఖ్య, డాక్టర్ భాగ్యశ్రీ ఆర్ బర్మన్ సంగీత దర్శకత్వం వహించిన చిత్ర గీతాలను ఆలపించారు. గాయకుడు ఖాజా మాట్లాడుతూ 1960లో ప్రారంభమైన ఆయన సినీ ప్రస్థానం 1990 దాకా సాగిందన్నారు. 300 పైగా చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించారని తెలిపారు.

కేసు విచారణ చేపట్టాం.. వేధించలేదు


మాట్లాడుతున్న సీఐ పవన్ కిషోర్

పటమట(విజయవాడతూర్పు): అమరాన్ బ్యాటరీ గోడౌన్‌లో పాత బ్యాటరీల్లో అవకతవకలు జరిగాయని దీనిపై విచారణ నిమిత్తం ఉల్లిగడ్డ ప్రసాద్‌ను విచారించేందుకు పిలిచామని పటమట సీఐ పవన్ కిషోర్ తెలిపారు. పటమట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉల్లిగడ్డ ప్రసాద్‌ను పటమట పోలీసులు వేధిస్తున్నారని, తన ఫిర్యాదును పట్టించుకోకపోవటంతో రాష్ట్ర, జాతీయ ఎస్సీ–ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశానని, దీనిపై ఎస్సీ–ఎస్టీ కోర్టులో ప్రైవేటు కేసు వేసినప్పటికీ పట్టించుకోలేదని ప్రసాద్ చేసిన ఆరోపణలో వాస్తవం లేదని సీఐ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు డొంక రోడ్డులో అమరాన్ బ్యాటరీస్ గోడౌన్‌ను ములగడ వారి ఫుడ్స్ అండ్ బేవరేజిస్ అండ్ లాజిస్టిక్స్‌లో జరిగిన బ్యాటరీల అవకతవకల్లో అక్కడ ఇన్‌చార్జిగా పనిచేసిన ఉల్లగడ్డ ప్రసాద్ రూ.33 లక్షలు విలువ చేసే 5,700 పాత బ్యాటరీలను మాయం చేసినట్లు సంస్థ అధినేత ములగడ సురేష్ కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై యాజమాన్యం అంతర్గత విచారణలో ప్రసాద్ తాను అవకతవకలకు పాల్పడినట్లు అంగీకరించి రూ లక్ష నగదును యాజమాన్యానికి చెల్లించాడని, మిగిలిన మొత్తాన్ని యాజమాన్యం అడుగుతుండటంతో స్పందించకపోవటంతో సంస్థ యాజమాన్యం విజయవాడ కమిషనరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఫిర్యాదు చేశారని తెలిపారు. యాజమాన్య ఫిర్యాదు మేరకు తాము విచారణకు పిలిచామని తెలిపారు. ప్రసాద్‌ను ఎవరూ వేధించలేదని, ప్రసాద్ వీడియోలో పటమట పోలీసులు వేధిస్తున్నారని చెప్పారని అదంతా సత్యదూరమని సీఐ పవన్ కిషోర్ పేర్కొన్నారు.

సమాజ పురోభివృద్ధిలో సాహిత్య సంస్థలు పునరంకితం కావాలి


అమరావతి ఫౌండేషన్ లోగో ఆవిష్కరిస్తున్న హరికృష్ణ, గోళ్ల నారాయణరావు, విజయలక్ష్మి

విజయవాడకల్చరల్: సమాజ పురోభివృద్ధిలో సాహిత్య కళా సంస్థలు పునరంకితం కావాలని జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ సూచించారు. లేపాక్షి ఫౌండేషన్ ఆవిర్భావ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హరికృష్ణ మాట్లాడుతూ.. రాయలసీమలోని వెనకబడిన ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు సాహిత్యం, సమాజ హితం కోసం లేపాక్షి సంస్థను స్థాపించారని తెలిపారు. సమకాలీన సాహిత్యం సామాన్యులకు చేరుకోవాలనే వారి ఆశయం సంకల్పం సఫలం కావాలని కోరారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. కవులు రచయితల సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. అమరావతి ఫౌండేషన్ అధ్యక్షురాలు మద్దుల విజయలక్ష్మి నిర్వాహకులకు సాహిత్య కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ నిర్వాహకులు వడ్డి సుధాకర్, డి.శ్రీనివాసులు, చిన్నారి అనిల్, అశోక్ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. సంస్థ లోగోను అతిథులు ఆవిష్కరించారు.

తరుణ్ కాకానికి ప్రశంసా పత్రం అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): వన్యప్రాణుల సంరక్షణకు అమరావతి బోటింగ్ క్లబ్ సీఈఓ తరుణ్ కాకాని చేస్తున్న కృషికి తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్ వర్మ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. హైదరాబాద్‌లోని మ్యారిగోల్డ్ హోటల్‌లో వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్(డబ్ల్యూ, డబ్ల్యూ ఎఫ్) నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జంతు జాతులను సంరక్షించడం, అటవీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. అందుకు గాను మెమెంటో, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

జ్వరాల తర్వాత కీళ్ల నొప్పులు వస్తున్నాయి


డాక్టర్ హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న సమభావన మిత్రమండలి ప్రతినిధులు

పటమట(విజయవాడతూర్పు): ప్రస్తుతం జ్వరాలు తగ్గిన తర్వాత కీళ్ల నొప్పులు రావడం సాధారణంగా మారిందని దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రూపా ఆర్థోపెడిక్ అధినేత డాక్టర్ హరి ప్రసాద్ అన్నారు. సమభావన మిత్ర మండలి ఆధ్వర్యంలో వాసవ్య మహిళా మండలిలో ఆదివారం ఆరోగ్య అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైరల్ జ్వరాల తర్వాత సుమారు రెండు నెలలపాటు కీళ్ల నొప్పులు, కాళ్ల తిమ్మిర్లు, చేతులు బిగుసుకుపోవటం తదితర లక్షణాలు కన్పిస్తున్నాయని, ఇవి ఎముకలు గుల్లగా మారటం వల్ల కలుగుతుందన్నారు. 45–50 మధ్య వయసు కలిగిన వారిలో ఈ లక్షణాలు ఎక్కువగా కన్పిస్తున్నాయని చెప్పారు. ఎముకలు గుల్లగా మారటం వల్ల చిన్న దెబ్బలకు కూడా ఎముకలు విరిగిపోతున్నాయని, జ్వరాలు అనంతరం వ్యాయామం చేయని వారిలో ఈ విధమైన వ్యాధి ఎక్కువగా ఉంటుందన్నారు. ఇది క్యాల్షియం, విటమిన్ డి తగ్గిపోవటం వల్ల కలుగుతుందని, ఎక్కువగా ఆల్కహాలు, స్మోకింగ్, మానసిక ఒత్తిడి, ఊబకాయం వల్ల ఇది పెరుగుగుందన్నారు. దీనికి సమతుల్యమైన ఆహారం తీసుకోవటం, ప్రతి రోజు 7–8 గంటల నిద్రపోవాలన్నారు. రోజుకు 2–3 లీటర్ల నీళ్లు తాగాలని, గ్యాస్ట్రిక్ మందులు, పెయిన్‌కిల్లర్లు మందులు వినియోగం తగ్గించాలని ఎక్స్‌రే ద్వారా వ్యాధిని గుర్తించి నివారించవచ్చని చెప్పారు. మండలి సభ్యులు హరిప్రసాద్‌ను సన్మానించారు. సమభావన మిత్రమండలి అధ్యక్షులు కోనేరు నరేంద్ర బాబు, సభ్యులు టి.శోభనాద్రి, డాక్టర్ ఎం.విఠల్ రావు, పీఆర్కే ప్రసాద్, యార్లగడ్డ రంగారావు, వెంకటరెడ్డి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు పింక్ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆదివారం పింక్ రిబ్బన్ ర్యాలీ నిర్వహించారు. రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బెంజిసర్కిల్ వరకూ ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రూట్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయభాస్కర్ మాట్లాడుతూ పింక్ కలర్ కాన్సెప్ట్‌తో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించడం ముఖ్యమని, నిర్ధారణ పరీక్షలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. రూట్స్ మహిళా కన్వీనర్ కె.మాధవి మాట్లాడుతూ ప్రతి మహిళ యుక్త వయస్సు నుంచే రొమ్ము స్వయం పరీక్ష విధానం తెలుసుకోవాలని సూచించారు. పింక్ బెలూన్స్ ధరించి రొమ్ము క్యాన్సర్ గురించి తెలియ చేసే కరపత్రాలు, పింక్ బెలూన్స్ అందచేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూట్స్ సభ్యులు చందు శ్రీనివాస్, యలమందయ్య, మహాదేవ్, తారకలక్ష్మి, సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ సేవలు విస్తృతం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అవసరాలను గుర్తించి వాటి మేరకు సేవలు అందించాలని వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ సూచించారు. స్థానిక దుర్గాపురం గులాబీతోటలో ఆదివారం శ్రీ అమరావతి వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా బండారు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా రాజనాల లక్ష్మి శ్రీనివాస్, కోశాధికారి ఎస్‌కే రషీద్, పి.రవి. ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ తదితరులచేత ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ పాస్ట్ గవర్నర్ రావి కృష్ణారావు, కోశాధికారి జి.వి.మురళీకృష్ణ, డెప్యూటీ గవర్నర్‌లు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్, ఇమ్మానేని కృష్ణప్రసాద్, ఎన్‌జీబీ ప్రసాద్, రీజినల్ కార్యదర్శి కొండాయగుంట రాము, గుర్రం ఏడుకొండలు, బి.ఆంజనేయరాజు పాల్గొన్నారు.

కృష్ణమాచార్యుల సంగీత సేవలు వెలకట్టలేనివి



విజయవాడకల్చరల్: సంగీత శేఖర శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల సంగీత సేవలు వెలకట్టలేనివని పద్మశ్రీ పురస్కార గ్రహీత మృదంగ విద్వాంసుడు డాక్టర్ యల్లా వెంకటేశ్వరరావు అన్నారు. కృష్ణమాచార్య కళాపీఠం ఆధ్వర్యంలో కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులుగా శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న యల్లా మాట్లాడుతూ.. సంప్రదాయ సంగీత కుటుంబానికి చెందిన కృష్ణమాచార్యులు బహుభాషా కోవిదుడని గుర్తుచేశారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం సంచాలకుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కృష్ణమాచార్య కళాపీఠం సంగీత రంగంలో విశేషమైన కృషి చేసిన వారికి స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేసినట్లు తెలిపారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి సుదీర్ఘకాలం సేవలను అందించినట్లు గుర్తు చేశారు.. 2024 సంవత్సరానికి గాత్ర విద్వాంసులు హైదరాబాద్ సోదరుల్లో ఒకరైన డి.రాఘవాచారికి కృష్ణమాచార్యులు స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేశారు. ఉదయం ప్రారంభమైన సంగీత సేవలో అనఘ, హరిద్ర, శాంతిశ్రీ, రామలక్ష్మి బృందం, చిన ముక్తేవి సంజన, టీకేవీ రామానుజా చార్యులు, పద్మావతి తదితరులు భక్తిగా సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. కేవీపీ శాస్త్రి, కేఎస్ గోవిందరాజన్, విష్ణుభొట్ల సోదరీ మణులు, గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు. సంగీత కళాకారులు పోపూరి గౌరీనాథ్ నిర్వహించారు.

శృతిలయ సమ్మేళనం.. సంగీతోత్సవం



విజయవాడకల్చరల్: దృశ్యవేదిక నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. వీణాధరి సంగీత సంగీత విద్యాలయం నిర్వాహకురాలు నందిని శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్.నిఖిల ప్రియ, బి.కృష్ణకుమారి, ఎస్.తరుణి, జి.రాజేశ్వరి, సంగీత మూర్తి త్రయం త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిల కీర్తనలను వీణపై మధురంగా పలికించారు. మృదంగంపై విశ్వనాథ శరవణ, తాళంపై సీతా వైష్ణవి సహకరించారు. రంగస్థల కార్యక్రమంలో భాగంగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిశ్చంద్ర నాటకంలోని అడవి సన్నివేశాన్ని కళాకారులు నటించి రక్తి కట్టించారు. హరిశ్చందునిగా బుర్రా నరేన్, చంద్రమతిగా లక్ష్మీశ్రీ, నక్షత్రకునిగా పరదేశి, లోహితాస్యునిగా ఆరాధ్య నటించారు. ఈవన రమేష్‌బాబు, కత్తి శ్యాంప్రసాద్, భాగ్యరాజు పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

నేడు ప్రజా ఫిర్యాదులు - పరిష్కార కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్–1, సత్యనారాయణపురంలోని సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ విభాగం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆయుర్వేద అవగాహన సదస్సు, ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ధన్వంతరి చిత్రపటానికి వైద్యులు పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వ ఆయుర్వేద పరిషత్ జనరల్ సెక్రటరీ డాక్టర్ నల్లు ధరణి కుమార్ మాట్లాడుతూ.. ఆయుర్వేదం విశిష్టత, ప్రస్తుత కాలంలో ఆయుర్వేదం అభివృద్ధి, దాని ఉపయోగాలను వివరించారు. ఆయుర్వేద పద్ధతులైన శమన, శోధన చికిత్సల ద్వారా ఎటువంటి రోగాలైన సైడ్ ఎఫెక్ట్ లేకుండా నయం చేయవచ్చన్నారు. డాక్టర్ సాహితీ మాట్లాడుతూ.. ప్రతి ఏటా ధన్వంతరి జయంతిని జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. ప్రజలు ఆయుర్వేదంపై ఉన్న అపోహలు వీడాలన్నారు. శిబిరంలో వైద్యులు ప్రశాంత్, రాఘవ, వాకర్స్ క్లబ్ విజయవాడ అధ్యక్షుడు మోటూరి ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.